క్లుప్తంగా

వికసిత భారత సంకల్ప యాత్రకు ఏర్పాట్లు



మహిళా వర్సిటీలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

తిరుపతి సిటీ: తిరుపతి వేదికగా నిర్వహించనున్న వికసిత భారత సంకల్ప యాత్ర కార్యక్రమం ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ హరిత శుక్రవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈ నెల 18వ తేదీ జరిగే యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ విచ్చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పథకాల వివరాల తెలియజేసే స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, హెల్త్, ఇంజినీరింగ్, హౌసింగ్, రెవెన్యూ, ఎడ్యుకేషన్ అధికారులు పాల్గొన్నారు.

పోరాట స్వరం మూగబోయింది

తిరుపతి సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై పోరాటాలు ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ గారి సొంతమని, ఆయన ఆకస్మిక మరణంతో పోరాట స్వరం మూగబోయిందని పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆఖరి శ్వాస వరకు ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం చేసిన ఉద్యమకారుడని కొనియాడారు. గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఆయన చేసి సేవలు చిరస్మరణీయమని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేస్తున్నట్లు ఆ ప్రకటనలో వెల్లడించారు.

గేట్ ప్రాంగణ ఎంపికల్లో 71మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

తిరుపతి సిటీ: భవానీ నగర్‌లోని గేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 340మంది అభ్యర్థులు హాజరు కాగా అందులో 71మందికి ఉద్యోగాలు లభించాయని కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. మంచి వేతనాలకు కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను ఈ సందర్భంగా ప్రిన్సిపల్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

ఫ్లాగ్ ఫండ్ విరాళం సేకరణ



మేజర్ కులదీప్‌కు విరాళం అందిస్తున్న ఎన్‌సీసీ అధికారి, విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థినులు సైనికుల సహాయార్థం ఫ్లాగ్ ఫండ్ విరాళ సేకరణను శుక్రవారం ఆ పాఠశాల ఆవరణలో చేపట్టారు. సేకరించిన రూ.10,330 మొత్తాన్ని ఎన్‌సీసీ అధికారి భారతి ఆధ్వర్యంలో ఫైవ్ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారిక సుబేదార్ మేజర్ కులదీప్‌కు అందించారు. విద్యార్థుల్లో సేవాభావం, దేశభక్తి పెంపునకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని, విద్యార్థులు విరాళం సేకరించి ఈ మొత్తాన్ని అందించడం అభినందనీయమని ఆయన కొనియాడారు.

తపాలా ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి

తిరుపతి (అలిపిరి): తపాలా ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తిరుపతిలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె శుక్రవారం చేపట్టారు. స్థానిక తపాలా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తిరుపతి డివిజన్ జీడీఎస్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి పాల్గొన్నారు.

766 మందికి తుపాన్ పరిహారం

- 752 కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2500
- 14 మందికి..ఒక్కొక్కరికీ రూ.1000 చొప్పున పంపిణీ



పూలవానిగుంట బాధితులకు పరిహారం పంపిణీ



పూలవానిగుంట సచివాలయం వద్ద తుపాను బాధితులు

తిరుపతి అర్బన్: ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు మిచాంగ్ తుపాన్‌తో తిరుపతి అర్బన్ ప్రాంతంలోని పలువురికి తీవ్రమైన నష్టం చోటుచేసుకుంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు నష్టపోయిన వారి జాబితాను ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్ అధికారులను నుంచి సేకరించారు. ఆమేరకు తిరుపతి ఆర్డీవో నిషాంత్ రెడ్డి, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ పర్యవేక్షణలో శుక్రవారం 766 కుటుంబాల తుపాన్ బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. దీంతో డిప్యూటీ తహశీల్దార్ రామచంద్ర చేతుల మీదుగా అర్బన్ ప్రాంతంలోని ఆయా వార్డు సచివాలయాల్లో నగదును అందించారు. పూలవానిగుంట, గొల్లవానిగుంట ప్రాంతంలోని 495 కుటుంబాలకు, పార్వతీపురంలో 212 కుటుంబాలకు, ఉప్పంగి దళితవాడలోని 24 కుటుంబాలకు, తెల్లగుంటలోని 20 కుటుంబాలకు, కేబీఆర్ నగర్(మంగళం వద్ద)లోని 15 కుటుంబాలకు నగదు పంపిణీ చేశారు. వీరిలో 752 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.2500 చొప్పున, 14 మందికి రూ.1000 చొప్పున అందించారు. అర్హత ఉన్న అందరికీ న్యాయం చేసేలా చర్యలు చేపట్టారు. ఓ క్రమపద్ధతిలో అందరికీ అందించారు. దీంతో బాధితులు అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు నూతనరెడ్డి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు.

భవిష్యత్తు తరాలకు సీఎం జగన్ భరోసా



సంక్షేమ పథకాలు బోర్డును అవిష్కరిస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: రాష్ట్రంలో భవిష్యత్తు తరాలకు సీఎం జగన్ భరోసా అందించే పథకాలను అందిస్తున్నారని తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు నెరబైలు, చెరుకువారిపల్లె, ఉదయమాణిక్యం, కూరపర్తివారిపల్లె పంచాయతీల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ, నాలుగున్నరేళ్లలో జగనన్న ప్రజలకు అద్భుతమైన సుపరిపాలనను అందించి చరిత్ర సృష్టించాలరన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు అందించారన్నారు. ఆయన తనయుడుగా అందరికీ అందుబాటు ఉంటానన్నారు. కరోనా కాలంలో, ప్రకృతి వైపరీత్యాల సమయంలోనే కాకుండా పండుగల సమయంలో ఎమ్మెల్యే చేస్తున్న సేవలను వివరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం నిధులతో అద్వితీయంగా తీర్చిదిద్దారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించాలని కోరారు. నెరబైలు పంచాయతీలో రూ.33.57 కోట్లు సంక్షేమ నిధులు పంపిణీ, రూ.10.27 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఎర్రావారిపాళెం గడిచిన నాలుగేళ్లలో రూ.253 కోట్లు సంక్షేమానికి, రూ.7.79 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. చెరుకువారిపల్లెలో రూ.17.36 కోట్లు సంక్షేమం కోసం, రూ.7.57 కోట్లు అభివృద్ధి పనులు, ఉదయమాణిక్యంలో రూ.19.35 కోట్లు సంక్షేమానికి, రూ. 7.55 కోట్లు అభివృద్ధికి, కూరపర్తివారిపల్లెలో రూ.13.39 సంక్షేమానికి, రూ.3.20 కోట్లుతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మి, వైస్ ఎంపీపీ చెంగల్‌రెడ్డి, సర్పంచులు, పెద్దరెడ్డెప్పరెడ్డి, నాగార్జునరెడ్డి, హరినాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వెంకటసిద్దులు, ఎంపీడీఓ అమర్‌నాథ్, తహసీల్దార్ దస్తగిరయ్య, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం

- రూ.3 వేలకు పెన్షన్ పెంపుపై సర్వత్రా హర్షం



పింఛను పెంపుపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతూ చెవిరెడ్డి లక్ష్మికి హారతులు పడుతున్న పద్మావతిపురం లబ్ధిదారులు

తిరుపతి రూరల్: ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పెన్షన్‌ను రూ.3వేలకు పెంచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తామంతా రుణపడి ఉంటామని పలువురు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం పంచాయతీలో శుక్రవారం గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి నిర్వహించారు. ఆమెను కలిసిన సామాజిక పింఛనుదారులు పైవిధంగా తమ ఆత్మీయతను చాటారు. జగనన్న ఇస్తున్న పింఛన్లతో గౌరవం పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం గడప గడపకు వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనుల గురించి లక్ష్మి తెలియజేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి పద్మావతిపురం మాజీ సర్పంచ్ గణపతినాయుడు, సర్పంచ్ జ్యోతి, ఉపసర్పంచ్ రాజేశ్వరి, డివిజన్ అధ్యక్షుడు లోకేశ్వర్ రెడ్డి, మహి, మునికృష్ణారెడ్డి, అరుణాచలం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి

తిరుపతి లీగల్: నూతన సంవత్సరం–2024 క్యాలెండర్లను తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్ శుక్రవారం న్యాయమూర్తి చాంబర్‌లో ఆవిష్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు, తిరుపతి సీనియర్ న్యాయవాది గల్లా సుదర్శన్‌రావు తన సొంత ఖర్చులతో 2024 సంవత్సరంలో కోర్టులకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన సెలవులు, పని దినాలను తెలిపే క్యాలెండర్లు తయారు చేశారు. శుక్రవారం జడ్జి గురునాథ్ ఆ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. తిరుపతి న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు గోపిచంద్, న్యాయవాదులు దేవరాజులు, రాజశేఖర్, గిరిబాబు, హరికృష్ణ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి రూరల్: తిరుపతి రాజీవ్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనుల నేపథ్యంలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎస్పీడీసీఎల్ తిరుపతి డివిజన్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాంధీపురం, శ్రీనగర్‌కాలనీ, వైకుంఠపురం, పీవీనగర్, ముత్యాలరెడ్డిపల్లె, వాసవీనగర్, సరస్వతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేశారు.

నేటి నుంచి తిరుపతి బాలోత్సవం

తిరుపతి కల్చరల్: తిరుపతి బాలోత్సవం ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్లో శని, ఆదివారం రెండు రోజులపాటు పిల్లల పండుగ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ పిల్లల పండుగ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభిస్తారని తిరుపతి బాలోత్సవం వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లారపు నాగార్జున తెలిపారు. అతిథులుగా మేయర్ డాక్టర్ శిరీష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి హాజరవుతారని తెలిపారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

17న టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

తిరుపతి(అలిపిరి): ఈ నెల 17న తిరుపతిలోని శ్రీత్యాగరాజ మండపంలో పెన్షనర్స్ డే సందర్భంగా టీటీడీ విశ్రాంత ఉద్యోగులను సన్మానించనున్నారు. డిసెంబర్ 2020, 2021, 2022 నాటికి 75 సంవత్సరాలు వయస్సు పూర్తి చేసుకున్న టీటీడీ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం చేస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. అర్హులైన విశ్రాంత ఉద్యోగులు గుర్తింపు కార్డులతో కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

విధుల బహిష్కరణ కొనసాగింపు

తిరుపతి లీగల్: భూహక్కు చట్టాన్ని నిరసిస్తూ తిరుపతి న్యాయవాదులు 14 రోజులుగా విధులకు హాజరు కాకుండా చేస్తున్న నిరసనను కొనసాగించాలని శుక్రవారం ఏకగ్రీవంగా తీర్మానించినట్టు తిరుపతి న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు గోపీచంద్ మీడియాకు తెలిపారు. శుక్రవారం తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటకుమార్, బార్ కౌన్సిల్ సభ్యుడు గల్లా సుదర్శన్ రావు, సీనియర్ న్యాయవాదులు కంచి ప్రకాశం, ఎంఎన్ మణి, వెంకటేష్ ప్రసంగించారు.

ప్రతిభకు ప్రశంసా పత్రాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో డిపో మేనేజర్ కేసీజీ భాస్కర్ చేతుల మీదుగా పలువురు ప్రశంసాపత్రాలను పొందారు. కండక్టర్ వి.లలిత(పల్లె వెలుగు), డ్రైవర్లు యూ.నరసింహులు(బెంగళూరు సెక్టర్), యూఎస్ మణ్యం(విజయవాడ సెక్టర్), ఆర్.సురేంద్ర(చెన్నై సెక్టర్), జీఎన్ భూషణం(తిరుమల సెక్టర్) ఉన్నారు. నవంబర్ నెలకు ఉత్తమ ప్రతిభ అవార్డులు అందుకున్న కండక్టర్, డ్రైవర్లు సంతోషం వ్యక్తం చేశారు.

స్టాప్ ర్యాగింగ్ పోస్టర్ల ఆవిష్కరణ



స్టాప్ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ: ఎస్వీయూ వైఎస్ఆర్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన పోస్టర్లను శుక్రవారం 23వ వార్డు వేదికగా జరిగిన కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, డివిజన్ అధ్యక్షుడు రఘురామిరెడ్డి, వర్సిటీ వైఎస్ఆర్ సీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, విద్యార్థి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం... అచ్యుత దేవరాయలు మార్గం



అచ్యుత దేవరాయలు మార్గం పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: నగరాభివృద్ధితోపాటు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్‌తో నిర్మించిన అచ్యుత దేవరాయలు మార్గం (అలిపిరి రోడ్డు, మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ నుంచి సింగాలగుంట, గిరిపురం, చెన్నారెడ్డి కాలనీ, ఓల్డ్ మెటర్నిటీ హాస్పిటల్ రోడ్డును కలుపుతూ) కనెక్టివిటీ రోడ్డు నిర్మాణ పనులను డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందన్నారు. మిగిలిన అరకొర పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. ఆయనతోపాటు బచ్చల బాలసుబ్రహ్మణ్యం, కోదండ, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇమ్రాన్ బాషా, బాలాజీ, శివ, ఎంఈ వెంకటరమణారెడ్డి, డీఈ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని అధిగమిస్తే విజయం



అవగాహన కల్పిస్తున్న భాష్యం రామకృష్ణ

తిరుపతి ఎడ్యుకేషన్: పరీక్షలపై ఉన్న భయం, ఒత్తిడిని అధిగమిస్తే విజయం సొంతమవుతుందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. తిరుపతిలోని సీపీఐ భవనంలో శుక్రవారం ఆ విద్యాసంస్థల్లోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షలకు సన్నద్ధం అనే అంశంపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సాధారణంగా పరీక్షలంటే భయం ఉంటుందని, అయితే ఆ భయాన్ని పోగొట్టుకుంటే ఆత్మవిశ్వాసం వస్తుందని, తద్వారా పరీక్షలను సులువుగా ఎదుర్కోవచ్చని తెలిపారు. పరీక్షలకు ఉన్న కాస్త సమయంలో పరీక్షలకు ఎలా సన్నద్ధం అవ్వాలో వివరించారు. ఉన్నత విద్యకు పది పరీక్షలే కీలకమని, దీనికోసం చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, తగిన విశ్రాంతి అవసరమన్నారు. ఇవన్నీ పాటిస్తే విజయం సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల సలహాదారు మైకేల్‌రాజు, సీఈఓ హనుమంతరావు, జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, భాష్యం విద్యాసంస్థల ప్రిన్సిపల్, విద్యార్థులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై అవగాహన



అవగాహన కార్యాక్రమంలో మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్)లో శ్రీపద్మావతి ఆడిటోరియంలో శుక్రవారం పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ ఆర్వీ కుమార్ విచ్చేసి మాట్లాడుతూ కార్యాలయాలలో మహిళలపై లైంగిక వేధింపుల(నివారణ, నిషేధం, పరిహారం) నివారణ చట్టంను 2013లో ఆమోదించారన్నారు. స్విమ్స్ రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ బిట్లా మాట్లాడుతూ ఒకరి ఇష్టానికి వ్యతిరేకంగా వారి గోప్యతకు భంగం కల్గించడం లాంటివి చేయడం లైంగిక వేధింపులు చట్టం కిందకు వస్తాయన్నారు. డాక్టర్ ప్రతిభ, డాక్టర్ ఉషాకళావత్, డాక్టర్ సుధారాణి, డాక్టర్ శర్వాణీ, డాక్టర్ అంజూ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ మాలతీ, వర్సిటీ అధికారులు, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీటీసీ మునిరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతూ రాష్ట్రంలోనే అభివృద్ధికి చిరునామాగా ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నిలిచారని తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి కొనియాడారు. రూరల్ మండలం దుర్గసముద్రం పంచాయతీ అడపారెడ్డిపల్లెలో రూ.19 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మిట్టపల్లి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ ఆదెం మునిరెడ్డి, రామిరెడ్డి, నాదమునిరెడ్డి, చిరంజీవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి



శ్రీపొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు త్యాగం మనందరికి ఆదర్శనీయమని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలతో అలంకరించి నివాళులర్పించారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఆర్వోలు కేఎల్ వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, ఆరోగ్యాధికారి డాక్టర్ అన్వేష్ రెడ్డి, ఫైర్ అధికారి శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

అమరజీవి అందరికీ ఆదర్శం

తిరుపతి అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు అందరికి ఆదర్శంగా నిలిచారని స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి, బాలకొండయ్య, చంద్రశేఖర్, జ్యోత్స్న పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డీసీఎల్ బాలునాయక్

టాస్క్‌ఫోర్స్‌లో...

తిరుపతి మంగళం: కపిలతీర్థం సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ చక్రవర్తి ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పుష్పాలతో నివాళులర్పించారు. ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ రఫీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

'అమరజీవి' త్యాగం మరువలేనిది

తిరుపతి రూరల్: తెలుగు ప్రజలకు ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఎన్నటికీ మరువలేనిదని కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్ కీర్తించారు. శుక్రవారం డీసీఎల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్మికశాఖాధికారులు రాజయ్య, హేమాచారి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

తిరుపతి కల్చరల్: ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఆర్యవైశ్య సంఘం, ఆవోపా, మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఆవోపా నేతలు పేదలకు అన్నదానం చేశారు. ఆర్యవైశ్య సంఘం, ఆవోపా నేతలు దిండుకుర్తి నరసింహులు, శివకుమార్, జీవన్, వికాస్, కార్తీక్, శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.

రంగస్థలి నివాళి

పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో కళాకారులు ఆయనకు ఘన నివాళులు అర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కేఎస్.రాజా, మునికృష్ణ యాదవ్, సుబ్రమణ్యం యాదవ్, శాంబోలు హరినాథ్, జేజిరెడ్డి పాల్గొన్నారు.